సాక్షి
కాకినాడ
శుక్రవారం । 22 । నవంబర్ । 2024



నిత్యాన్నదానానికి రూ.1,01,116


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి పుట్టా గనిరాజు (మండపేట) గురువారం రూ.1,01,116 విరాళం అందజేశారు.



రూ.1,11,116 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కొప్పిశెట్టి వెంకట రమణ (కాకినాడ రామారావుపేట) గురువారం రూ.1,11,116 విరాళం సమర్పించారు.

కడలిలోకి 17 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి గురువారం 17,382 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 600, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

నిర్లక్ష్యపు నీడలు

- కూటమి సర్కార్ హయాంలో నిర్వీర్యమవుతున్న సచివాలయ వ్యవస్థ
- పింఛన్ల పంపిణీకే ఉద్యోగులు పరిమితం
- ప్రభుత్వ సేవలు అందక ప్రజల అవస్థలు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



2019 అక్టోబర్ 2న నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన కరప గ్రామ సచివాలయం

కాకినాడ సిటీ: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సులభతరంగా అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. పరిపాలనను కొత్త పుంతలు తొక్కించి, గ్రామ స్వరాజ్యాన్ని తీసుకుని వచ్చిన ఈ వ్యవస్థ దేశవ్యాప్తంగానే అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం 2019లో అధికారంలోకి రాగానే గాంధీ జయంతి రోజున సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. ఈ క్రమంలోనే ప్రతి 2 వేల జనాభా ఉన్న గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేశారు. సచివాలయాల ద్వారా అన్ని రకాల ప్రభుత్వ సేవలు నేరుగా, సులభతరంగా అందడంతో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ప్రజలకు ఎంతో మేలు చేసిన సచివాలయ వ్యవస్థపై ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యపు నీడలు పరచుకుంటున్నాయి.

545 పైగా సేవలు

జిల్లాలో 620 సచివాలయాలున్నాయి. ప్రతి సచివాలయంలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీస్, సర్వేయర్, వీఆర్‌ఓ తదితర 11 మంది ఉద్యోగులు అందుబాటులో ఉంటారు. సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా గ్రామ/వార్డు వలంటీర్లు కూడా ఉండేవారు. వీరి ద్వారా ప్రజలకు 545 పైగా ప్రభుత్వ సేవలు సకాలంలో అందేవి. గత ప్రభుత్వ హయాంలో కేవలం అర్హత ఉంటే చాలు.. ఎటువంటి సంక్షేమ పథకమైనా ఇంటి వద్దనే అందజేసేవారు. ప్రభుత్వ సేవ ఏదైనా సరే అర్హత ఉంటే పార్టీలతో సంబంధం లేకుండానే మంజూరు చేసేవారు. ఫలితంగా దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట పడింది.

నేడు ప్రజలకు తప్పని ప్రదక్షిణలు

ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వలంటీర్ వ్యవస్థను పూర్తిగా పక్కన పెట్టేసింది. అనంతరం సచివాలయ వ్యవస్థను కూడా నీరుగార్చేలా చర్యలు చేపడుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఇందులో భాగంగానే సచివాలయ ఉద్యోగులను కేవలం పింఛన్ల పంపిణీకే పరిమితం చేస్తూ, ఈ వ్యవస్థ లక్ష్యాన్ని దెబ్బ తీస్తున్నారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు దాటింది. ఇప్పటి వరకూ రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల వెబ్‌సైట్లు తెరచుకోలేదు. దీంతో అర్హులైన వారు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. కొత్త



నడకుదురులోని సచివాలయం

పింఛన్ల కోసం వెబ్‌సైట్‌ను ప్రభుత్వం తెరవకపోవడంతో వారందరూ నిరాశగా వెనుతిరగాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి పనులు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా చకచకా జరిగిపోయేవి. మరోవైపు కూటమి నేతలు గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమపై అనేక విమర్శలు చేస్తూ, అవమానకరంగా మాట్లాడారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో స్టిక్కర్లు అతికించడం నుంచి ఇంటింటి ప్రచారం వరకూ నియోగించి తమ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం పింఛన్ల పంపిణీకే పరిమితం చేయడం ద్వారా తమను ఉద్దేశపూర్వకంగానే ఖాళీగా ఉంచుతున్నారంటూ మండిపడుతున్నారు.

మంచి సేవలందేవి



సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని వర్గాల ప్రజలకూ మంచి సేవలు అందేవి. దీనివలన తమ సమస్యల పరిష్కారానికి ప్రజలు 10, 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్లే బాధ తప్పింది. జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉంటే ఇంటి వద్దనే సంక్షేమ పథకాలు అందించేందుకు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఎంతగానో ఉపయోగపడేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హత ఉన్న ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేని దుస్థితి. ఓ మంచి ఆశయంతో స్థాపించిన సచివాలయ వ్యవస్థను మరింత మెరుగు పరిచి స్థానికంగానే ప్రజల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పెంకే శ్రీలక్ష్మి, ఎంపీపీ, కరప

పటిష్టం చేయాలి



గతంలో మాదిరిగా గ్రామ/వార్డు సచివాలయాలను పటిష్టం చేయాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందుబాటులో ఉంచిన అన్ని రకాల సేవలనూ యథాతథంగా కొనసాగించాలి. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల కోసం నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసే బాధలు ప్రజలకు తప్పాయి. ప్రజల వద్దకే పాలన, గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ప్రభుత్వం పని చేయాలి. నిత్యం ఆధార్ అప్‌డేట్‌కు సచివాలయాల్లోనూ అవకాశం కల్పించాలి.

– అనిశెట్టి రామకృష్ణ, బంగారు, వెండి, డైమండ్స్ వర్తక సంఘం జిల్లా అధ్యక్షుడు, కాకినాడ

దోచుకునేందుకు దారులు

- ఆర్అండ్‌బీ రోడ్లపైనా టోల్‌కు సిద్ధం
- రహదారులపై ఎడాపెడా బాదుడే
- క్లారిటీ ఇచ్చిన సీఎం చంద్రబాబు
- పైలెట్ ప్రాజెక్టుగా గోదావరి జిల్లాలు

సాక్షి, అమలాపురం: టోల్ బాదుడుకు రెడీ అయ్యింది.. వాహనదారుల నడ్డి విరిచేందుకు కూటమి సర్కారు సిద్ధమవుతోంది. జాతీయ రహదారుల పైనే కాదు ఇక రాష్ట్ర రహదారుల పైనా 'టోల్' బాదుడు మొదలు కానుంది. దీనిపై శాసనసభ సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టత ఇవ్వడం ఆందోళన రేకెత్తిస్తోంది. దీనికి పైలట్ ప్రాజెక్టుగా గోదావరి జిల్లాలను ఎంపిక చేస్తామని ప్రకటించడంతో ఇక్కడి కార్లు, ట్రాక్టర్లు, లారీలు తదితర వాహన యజమానుల్లో గుబులు రేగుతోంది.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోట్లతో ఆధునీకరించిన రోడ్లపై ఇప్పుడు టోల్ గేట్లు ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధం కావడం విచిత్రంగా ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ)లో భాగంగా జిల్లాలోని పలు కీలక రహదారులను ఎంపిక చేసుకుని టోల్ వసూలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గత ఆగస్టులోనే దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆర్అండ్‌బీకి పంపించింది. తొలి దశలో జిల్లాలోని అమలాపురం-బొబ్బర్లంక, రాజవరం-పొదలాడ, జొన్నాడ-కాకినాడ రోడ్లను గుర్తించింది. తరువాత ఈ ప్రతిపాదనలు వెలుగులోకి రాలేదు. శాసనసభ సాక్షిగా గోదావరి జిల్లాల్లో స్టేట్ హైవేల నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తామని, ఫలితాలను బట్టి మిగిలిన జిల్లాలకు విస్తరిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో ఈ మూడు రోడ్లతో పాటు మరికొన్ని కీలక రహదారులపై సైతం టోల్ గేట్లను ఏర్పాటు చేస్తారని అనుమానాలు జిల్లా వాసుల్లో కలుగుతున్నాయి.

ఎన్‌హెచ్ పరిధిలోకి అమలాపురం- బొబ్బర్లంక

జిల్లాలో అమలాపురం-బొబ్బర్లంక రహదారి అత్యంత కీలకం. అమలాపురం నుంచి రావులపాలెం, అక్కడి నుంచి అటు తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, రాజమహేంద్రవరం, భద్రాచలం వంటి ప్రాంతాలకు వెళ్లేవారు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు.



అమలాపురం- బొబ్బర్లంక రహదారి

దీనిపై టోల్‌కు ప్రతిపాదనలు వెళ్లినా ఇప్పుడు ఈ రహదారిలో మూడొంతులు జాతీయ రహదారి పరిధిలోకి వెళుతోంది. 216 జాతీయ రహదారిపై పేరూరు వై.జంక్షన్ నుంచి ఈదరపల్లి, ముక్కామల, కొత్తపేట పలివెల వంతెన మీదుగా రావులపాలెం మార్కెట్ యార్డు వద్ద 216-ఏలో కలిసే వరకూ ఎన్‌హెచ్ అనుసంధాన రహదారి నిర్మించనున్నారు. దీంతో దీనిపై రాష్ట్ర టోల్ వసూలు చేసే అవకాశం లేదని సమాచారం. ఇదే సమయంలో రాజవరం-పొదలాడ రహదారితో పాటు కొత్తగా ద్వారపూడి - మండపేట, రామచంద్రపురం - ద్రాక్షారామ - యానాం రహదారి లేదా జొన్నాడ - మండపేట - రామచంద్రపురం - నడకుదురు - కాకినాడ రోడ్డును పీపీపీ విధానంలోకి తెస్తారని అంచనా వేస్తున్నారు.

ఆ దారి ఎంతో కీలకం

జిల్లాలో పొదలాడ-రాజవరం రహదారి సైతం కీలకమైంది. ఇది రాజోలు దీవి నుంచి విజయవాడ, ఇటు రావులపాలెం మీదుగా రాజమహేంద్రవరం వెళుతుంది. ఈ రెండు రోడ్లపై వాహనాల తాకిడి అధికంగా ఉంటోంది. అలాగే జొన్నాడ-కాకినాడ, ద్వారపూడి-యానాం రహదారులపై కూడా ప్రయాణికుల వాహనాలతో పాటు వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తులు, ఆక్వా, కోడిగుడ్ల ఎగుమతి సైతం జరుగుతోంది. ఇప్పటికే జాతీయ రహదారులపై ఎడాపెడా టోల్ వసూలుతో వాహనదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. రావులపాలెం నుంచి విజయవాడ రహదారిలో ఏకంగా నాలుగు టోల్ గేట్లు ఉన్నాయి. వీటికి అదనంగా స్టేట్ హైవేలపై కూడా టోల్ వసూలు మొదలైతే ప్రయాణికులపై మరింత భారం పడనుంది.

నాడు అభివృద్ధి.. నేడు టోల్ పడుద్ది

ఇప్పుడు ఎన్‌హెచ్ పరిధిలోకి వెళ్లనున్న అమలాపురం నుంచి బొబ్బర్లంక రహదారి రహదారిని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.18.13 కోట్లతో విడతల వారీగా ఆధునీకరించారు. ఈదరపల్లి నుంచి ముక్కామల మధ్య రహదారిని కూడా రూ.13 కోట్లతో అభివృద్ధి చేశారు. రాజవోలు-పొదలాడ రోడ్డును రూ.26 కోట్లతో రెండు దశల్లో నిర్మించారు. వీటిపై టోల్ వసూలుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది.

సరికొత్త రికార్డు దిశగా..

- కార్తికంలో ఇప్పటి వరకూ 93 వేల వ్రతాలు
- మరో 60 వేలు జరిగే అవకాశం
- 2022 కార్తికంలో అత్యధికంగా వ్రతాలు



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు



అన్నవరం: ఇంట్లో వివాహమైనా.. గృహప్రవేశమైనా.. ఇతర ఏ శుభకార్యమైనా.. సత్యనారాయణ స్వామి వారి వ్రతం ఆచరించడం తెలుగు రాష్ట్రాల్లోని హిందూ భక్తులకు ఆనవాయితీ. ఒక్కోసారి ఏ శుభకార్యమూ లేకపోయినా పర్వదినాలు.. పుట్టిన రోజు.. పెళ్లి రోజు వంటి సందర్భాల్లో కూడా సత్యనారాయణ వ్రతాలు చేసుకుంటారు. తాము కోరుకున్న కోర్కెలను ఆ స్వామి తీరుస్తాడని, తమను కష్టాల నుంచి గట్టెక్కిస్తాడని భక్తులు విశ్వసిస్తారు. ఒక విధంగా చెప్పాలంటే సత్యదేవుని వ్రతమాచరించని హిందువుల ఇల్లు ఉండదంటే అది అతిశయోక్తి కాదు. ఇలా ఇంటి వద్ద వ్రతం చేసుకున్నా.. ఏడాదిలో కనీసం ఒక సారైనా రత్నగిరికి వచ్చి.. భక్తవరదుడైన సత్యదేవుని వ్రతమాచరించే భక్తులు చాలా అధికంగా ఉంటారు. అందునా కార్తికం వంటి పవిత్ర మాసాల్లో మరింత మంది అన్నవరం సత్యదేవుని దర్శించి వ్రతం చేసుకుంటూంటారు.

నాలుగో వంతు వ్రతాలు కార్తికంలోనే..

హరిహరాదులకు ప్రీతికరమైన కార్తిక మాసమంతా పర్వదినాలే. దీంతో ఈ మాసంలో సత్యదేవుని వ్రతాలాచరిస్తే మరింత పుణ్యం వస్తుందని భక్తులు విశ్వసిస్తారు. ఈ నమ్మకంతోనే వ్రతాలాచరించేందుకు రత్నగిరికి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. సంవత్సరం మొత్తం సుమారు ఏడు లక్షలు వ్రతాలు జరుగుతుండగా.. వీటిలో దాదాపు నాలుగో వంతు వ్రతాలు ఈ ఒక్క నెలలోనే జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రస్తుత కార్తిక మాసంలో రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో రికార్డు స్థాయిలో వ్రతాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఈ పవిత్ర మాసం ప్రారంభమై గురువారం నాటికి 21 రోజులు పూర్తయ్యాయి. ఇప్పటి వరకూ 93 వేల వ్రతాలు జరిగాయి. ఈ మాసం ముగియడానికి మరో తొమ్మిది రోజుల సమయం ఉంది. ఆలోగా మరో 60 వేల వ్రతాలు జరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దేవస్థానం చరిత్రలో 2022 సంవత్సరం కార్తిక మాసంలో అత్యధికంగా 1,42,378 సత్యదేవుని వ్రతాలు జరిగాయి. ఆ రికార్డును ప్రస్తుత కార్తిక మాసంలో జరుగుతున్న వ్రతాలు అధిగమిస్తాయని భావిస్తున్నారు. సత్యదేవుని సన్నిధిలో సుమారు 300 మంది వ్రత పురోహితులు, 12 మంది వ్రత పురోహిత సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఈ వ్రతాలు చేయిస్తున్నారు.

ఆ వ్రతాలే అత్యధికం

రత్నగిరిపై రూ.300, రూ.1,000, రూ.1,500, రూ.2,000 టికెట్లతో సత్యదేవుని వ్రతాలు నిర్వహిస్తున్నారు. వీటిల్లో ప్రతి రోజూ జరుగుతున్న వ్రతాల్లో దాదాపు 70 శాతం రూ.300 టికెట్టు పైనే జరుగుతున్నాయి. సామాన్య భక్తులు ఎక్కువగా రూ.300 టికెట్టు వ్రతాలు ఆచరిస్తున్నారు. ప్రస్తుత కార్తిక మాసంలో ఇప్పటి వరకూ 93 వేల వ్రతాలు జరగగా వాటిలో దాదాపు 65 వేలు రూ.300 వ్రతాలే కావడం గమనార్హం. దేవస్థానంలో 18 వ్రత మండపాలు ఉండగా, వాటిలో ఎనిమిదింటిని రూ.300 వ్రతాల నిర్వహణకే కేటాయించారు. మిగిలిన మూడు టికెట్లపై వ్రతాలు 10 మండపాల్లో జరుగుతున్నాయి.

వ్రతాల ద్వారా అధిక ఆదాయం

ఏటా సత్యదేవునికి వస్తున్న ఆదాయంలో దాదాపు 25 శాతం వ్రతాల ద్వారానే సమకూరుతోంది. గత ఏడాది వ్రతాల ద్వారా రూ.38 కోట్లు పైగా ఆదాయం రాగా, ఇందులో ఒక్క కార్తికంలోనే సుమారు రూ.7 కోట్లు వచ్చింది. ఈ ఏడాది కార్తిక మాసంలో రూ.8 కోట్లు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకూ జరిగిన 93 వేల వ్రతాల ద్వారా రూ.6 కోట్లు పైగా వచ్చి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

వ్రతాలకు విస్తృత ఏర్పాట్లు



కార్తిక మాసంలో రత్నగిరికి వస్తున్న భక్తుల్లో అత్యధిక శాతం మంది సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్నారు. వీరికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా విస్తృత ఏర్పాట్లు చేశాం. పర్వదినాల్లో వేకువజామున ఒంటి గంట నుంచే వ్రతాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. అదనపు వ్రత మండపాలతో పాటు తోపులాట, తొక్కిసలాట జరగకుండా కంపార్టుమెంట్లు ఏర్పాటు చేశాం. కార్తిక పౌర్ణమి పర్వదినం నాడు 10 వేల వ్రతాలు జరిగినా భక్తులకు ఎక్కడా ఇబ్బంది కలగలేదు. భక్తులు కూడా సంతృప్తి వ్యక్తం చేశారు. – కె.రామచంద్ర మోహన్, కార్యనిర్వహణాధికారి, అన్నవరం దేవస్థానం

న్యూస్‌రీల్

నేడు, రేపు ఎస్టీ కమిషన్ సభ్యుని పర్యటన

కాకినాడ సిటీ: రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ శుక్ర, శనివారాల్లో శంఖవరం, రౌతులపూడి మండలాల్లో పర్యటించనున్నారు. కలెక్టర్ షణ్మోహన్ సగిలి గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. శంకర్ నాయక్ కాకినాడ నుంచి శంఖవరం మండలంలోని అనుమర్తి గ్రామానికి శుక్రవారం ఉదయం 10 గంటలకు చేరుకుంటారు. అక్కడ గిరిజనులతో సమావేశమై, సమస్యలు తెలుసుకుంటారు. అనంతరం ఆవెల్తి గిరిజన గ్రామం చేరుకుని, ప్రజలు సమస్యలు తెలుసుకుంటారు. భోజన విరామం అనంతరం ఓంద్రిగుల గ్రామానికి వెళ్లి, గిరిజనుల సమస్యలపై చర్చిస్తారు. అక్కడి నుంచి కాకినాడ జేఎన్‌టీయూ అతిథి గృహానికి రాత్రి 7 గంటలకు చేరుకుంటారు. శనివారం ఉదయం 7 గంటలకు జేఎన్‌టీయూ నుంచి బయలుదేరి రౌతులపూడి మండలం పెద్దూరు చేరుకుని, గిరిజనులతో మమేకమవుతారు. అనంతరం గిన్నలరం గ్రామానికి చేరుకుని, గిరిజనుల సమస్యలు తెలుసుకుంటారు. భోజన విరామం తర్వాత బయలుదేరి 4 గంటలకు జేఎన్‌టీయూ అతిథి గృహానికి చేరుకుంటారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం విజయవాడకు బయలుదేరుతారు.

నేడు సత్య స్వాముల పడిపూజ



పడిపూజ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని వార్షిక కల్యాణ మండపం వద్ద శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు సత్య స్వాముల పడిపూజ నిర్వహించనున్నారు. సత్య దీక్షలు ఆచరించిన వేలాది మంది స్వాములు సత్యదేవుని జన్మనక్షత్రం మఖ సందర్భంగా శనివారం స్వామివారి సన్నిధిలో దీక్ష విరమించనున్నారు. ఈ దీక్షల విరమణకు ముందు రోజు సత్య స్వాములతో రత్నగిరిపై ఏటా పడిపూజ చేయడం ఆనవాయితీ. పూజలో పాల్గొనే భక్తులకు ఫలహారం ఏర్పాటు చేశారు. ఈ పూజలకు వెయ్యి మందికి పైగా భక్తులు హాజరవుతారని అధికారులు తెలిపారు. ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు పడిపూజ ఏర్పాట్లను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహనరావు, ఈఈ రామకృష్ణ, ఏఈఓ కొండలరావు, డీఈ రాంబాబు తదితరులు గురువారం పరిశీలించారు.

చట్టాలు సక్రమంగా అమలు చేయాలి



అధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కృష్ణమోహన్

సామర్లకోట: గిరిజనులకు ఎంతో ఉపయోగపడే విస్తరణ, పీసా చట్టాలను సక్రమంగా అమలు చేయాలని స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం (ఈటీసీ) వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ అధికారులకు సూచించారు. ఈటీసీలో రెండు రోజుల పాటు నిర్వహించిన గిరిజనాధికారుల సమీక్ష గురువారం ముగిసింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులతో గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న వారి సంక్షేమం కోసం ఈ సమీక్ష నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణ మోహన్ మాట్లాడుతూ, వివిధ జిల్లాల్లోని అధికారులు ఇచ్చిన సూచనలు, సలహాలతో జిల్లా, మండల స్థాయిల్లో శిక్షణ ఇచ్చేందుకు మంచి పుస్తకాలు తయారు చేసే అవకాశం కలిగిందన్నారు. వచ్చే నెల 3 నుంచి జిల్లా, మండల స్థాయి శిక్షణలు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ డైరెక్టర్లు రమణ, రామనాథం, శ్రీదేవి, ఈటీసీ ఫ్యాకల్టీలు పాల్గొన్నారు. సమీక్షలో పాల్గొన్న ఆయా జిల్లాల అధికారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు ఎం.రాధాకృష్ణ, ఉప్పలపాటి జానికమ్మ పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. 60 రోజులకు గాను రూ.29,57,711 లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. అలాగే ఏడు గ్రాముల బంగారం, 743 గ్రాముల వెండి, 17 విదేశీ నోట్లు ఉన్నాయన్నారు. ఈ లెక్కింపులో ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం, పీడీ

కరప: అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్లకు కరప మండలం పెద్దాపురప్పాడు బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్ గురువారం ఈ విషయం తెలిపారు. విద్యా శాఖ ఆధ్వర్యాన కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరం హైస్కూలు క్రీడా మైదానంలో జరిగిన సాఫ్ట్‌బాల్ అండర్-14, అండర్-17 ఎంపిక పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని పేర్కొన్నారు. అండర్-17 విభాగం బాలుర జట్టుకు వై.సుధీర్, డి.సూర్య వెంకట మణికంఠ, జి.వీర మణి కుమార్, బాలికల జట్టుకు కె.సంధ్యారాణి ఎంపికయ్యారని వివరించారు. అనంతపురంలో శనివారం నుంచి సాఫ్ట్‌బాల్ అండర్-17 పోటీలు జరుగుతాయన్నారు. అండర్-14 సాఫ్ట్‌బాల్ విభాగంలో బాలుర జట్టుకు ఎస్.నాగేంద్ర, బి.అంజనీకుమార్, బాలికల జట్టుకు సీహెచ్ విజయలక్ష్మి, కె.అనురాధ ఎంపికయ్యారని తెలిపారు. చిత్తూరు జిల్లా అరకొండలో శుక్రవారం నుంచి అండర్-14 పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ బీవీవీఎస్‌వీ ప్రసాద్‌లను గ్రామ సర్పంచ్ బిరుదా సరస్వతి, ఉప సర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ యాళ్ల నాగమణి, హెచ్‌ఎం శ్రీనివాస్, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు టి.వెంకట్రావు తదితరులు అభినందించారు.

చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు



కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కిర్లంపూడి: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజుతో కలిసి రికార్డులు పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వాహణపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీగా విధులు చేపట్టిన తరువాత మొదటి సారిగా కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించినట్టు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు పాల్పడినా, సామాజిక మాధ్యమాల్లో హద్దుమీరి ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై జి.సతీష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విశాఖలో డిసెంబరు 7, 8 తేదీలలో జరిగే అంతర్ జిల్లాల సబ్ జూనియర్స్ ఈత పోటీల్లో పాల్గొనే జట్టు వివరాలు జిల్లా స్విమ్మింగ్ సంఘ కార్యదర్శి ఐ.రాజు గురువారం తెలిపారు. గ్రూప్-1లో కె.ధనుంజయ్, ఎం.ముఖేష్, వి.మణికంఠ నవీన్ ఎంపిక కాగా, గ్రూప్-2లో టీవీసీ సాయి సాకేత్, టి.పూజిత్‌సాయి హర్ష, డి.అహిల్, ఆర్ఎస్ఎస్ఎస్ ధనుష్, ఎ.అభినయ్, ఎస్.హిమాన్షు, విరాజ్ విజయ్ కాలే, ఆర్.మనోహర్ శ్రీసాయి, ఎస్.మైఖేల్ అర్జున్, వై.గౌతమ్, పి.కౌశిక్ వర్ధన్, ఆర్ఎస్ జాన్, పి.దక్షిత, సీహెచ్ హిమద్యుతి ఎంపికయ్యారు. గ్రూప్-3లో దర్శిల్, పి.నీరజ్‌వర్ధన్, జి.భువనేష్, ఎం.షణ్ముఖ, ఎం.సాయి చరణ్, కె.ఎస్.రాధా కుమార్, బి.రాబిన్, ఎం.పల్లవి, ఎం.యశస్విని, తేజశ్రీ, జి.అన్విధ ఎంపికైన వారిలో ఉన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ అప్పలనాయుడు గురువారం అభినందించారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌పై తప్పుడు కేసు



రామిశెట్టి బులిరామకృష్ణ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ (నాని)పై ప్రత్తిపాడు పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగితే కొంకిపూడి శివ లోవరాజును గ్రామ పెద్దగా రామకృష్ణ మందలించారు. దీనిని ఆసరాగా తీసుకొన్న కూటమి నేతలు ఆ సమయంలో అక్కడ లేని లోవరాజు భార్య సత్యతో అసభ్యకరంగా ప్రవర్తించానంటూ తనపై తప్పుడు కేసు పెట్టించి వేధిస్తున్నారని నాని వాపోయారు. తనపై తప్పుడు కేసు పెట్టారంటూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. 41ఏ నోటీసు ఇచ్చి విచారణ చేపట్టాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

విద్యుదాఘాతానికి కూలీ మృతి



వెంకటేశ్వర రావు (ఫైల్)

నల్లజర్ల: మండలంలో అయ్యవరంలో విద్యుదాఘాతానికి వ్యవసాయ కూలీ మృతి చెందాడు. కడారి వెంకటేశ్వరావు (43) గురువారం అయ్యవరం గ్రామానికి చెందిన సూరి బోయిన బుల్లియ్యకు చెందిన పామాయిల్ తోటలో గెలలు కోస్తుండగా తోటలో డ్రిప్ వైరు కాలికి చుట్టుకుంది. దీంతో అతను ముందుకు తూలిపడగా చేతిలో ఉన్న అల్యూమినియం పైపుతో ఉన్న కత్తి విద్యుత్ తీగపై పడింది. ఆ తీగ నుంచి విద్యుత్ వచ్చి వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు.

సత్యదేవుని సన్నిధిలో వృద్ధాశ్రమ సభ్యులు



సత్యదేవుని సన్నిధిలో రాహుసౌరభ్ నిత్యాన్నదాన వృద్ధాశ్రమ వృద్ధులు

అన్నవరం: విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గం రావివలస గ్రామానికి చెందిన రాహుసౌరభ్ నిత్యాన్నదాన వృద్ధాశ్రమానికి చెందిన వృద్ధుల కోరిక దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ చొరవతో నెరవేరింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. ఆ రాహుసౌరభ్ నిత్యాన్నదాన వృద్ధాశ్రమానికి చెందిన 22 మంది వృద్ధులు గురువారం రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించి పూజలు చేశారు. కార్తిక మాసంలో పుణ్యక్షేత్రాలను సందర్శించాలని వారు దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణను కోరగా ఆయన బస్సు ఏర్పాటు చేసి వారిని పుణ్యక్షేత్రాలు దర్శించే అవకాశం కల్పించారు.

ఇక అన్నింటికీ ఆధార్‌మే..





- పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలంటున్న యూఐడీఏఐ
- నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వ సేవలకు దూరం

కాకినాడ సిటీ: ఇక అన్నింటికీ 'ఆధార్'మే.. పుట్టిన పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకూ ప్రతి పనికీ ఆధార్ తప్పనిసరి అయ్యింది. ప్రజల గుర్తింపునకు సంబంధించి అతి ముఖ్యమైన డాక్యుమెంట్‌లలో ఇది ప్రధానమైంది. పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, తదితరాలతో పాటు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఆధార్ కార్డు కచ్చితంగా ఉండాల్సిందే. అయితే ఆధార్ కార్డు పొందిన ప్రతి ఒక్కరూ పదేళ్లకోసారి గుర్తింపు కార్డు, అడ్రస్ ప్రూఫ్‌ను సమర్పించి సెంట్రల్ ఐడెంటిటీస్ డేటా రిపాజిటరీ (సీఐడీఆర్)లోని వివరాలు అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ సేవలను ఉచితంగా కల్పిస్తూ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవడానికి యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) వెసులుబాటు కల్పించింది. అయితే ప్రతి ఒక్కరికీ ఆధార్ ఉండాలని, పదేళ్ల కిందట తీసుకున్నవారు వాటిని నవీకరించుకోవాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా చాలా మంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. తీరా అవసరమైనప్పుడు ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను పొందేందుకు ఆధార్ తప్పనిసరి. ఆధార్‌లో సాంకేతిక తప్పిదాలుంటే అర్హులు సైతం సంక్షేమ ఫలాలకు దూరమయ్యే అవకాశముంది. ఆధార్‌లో పొరపాట్లు ఉంటే ఉద్యోగులు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పవు. ప్రస్తుతం విద్యార్థులకు అపార్ నమోదు ప్రక్రియ చేపడుతున్నారు. కొందరు విద్యార్థుల ఆధార్, పాఠశాల రికార్డుల్లో నమోదైన వివరాలు సరిపోలక పోవడంతో అపార్ నమోదు సాధ్యం కావడం లేదు. దీంతో అత్యవసరంగా ఆధార్‌లో సవరణలు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ విద్యార్థులందరికీ అపార్ నమోదు తప్పనిసరి చేయడంతో జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియను చేపడుతున్నారు.

డిసెంబరు 14 వరకూ అవకాశం

ప్రభుత్వం ఆధార్‌కు సంబంధించిన సేవలను ప్రజలకు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా 97 కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కేంద్రాలు సక్రమంగా పని చేయకపోతుండడంతో ఆధార్ అప్‌డేట్‌కు ప్రజలు నిరంతరం సమస్యలను ఎదుర్కొంటున్నారు. అయితే ఈ సమస్య నుంచి బయటపడేందుకు పోస్టాఫీస్‌ల్లో కూడా ఆధార్ సంబంధిత సేవలను పొందవచ్చని ఇండియా పోస్ట్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఆధార్ వివరాలను పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలని యూఐడీఏఐ గతంలో ప్రకటించింది. అప్పట్నుంచి పలుమార్లు గడువు పొడిగిస్తూ వస్తోంది. ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువును ఈ ఏడాది చివరి వరకూ పెంచుతూ నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 14వ తేదీ వరకు ఈ అవకాశం ఉంటుందని పేర్కొంది. అంతేకాదు ఆధార్ కార్డులో చిన్న మార్పులు చేసుకోవాల్సిన వారు కూడా చేసుకోవచ్చు. అయితే ఏ మార్పు చేసుకోవాలని అనుకుంటున్నారో, అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. కార్డుదారు పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి అంశాల్లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. రాష్ట్రంలోని గిరిజనులు, చిన్నారులు, అనాథల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గిరిజన ప్రాంతాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, అనాథ శరణాలయాల్లో ఈ నెల 19 నుంచి 22 వరకూ, మళ్లీ ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకూ క్యాంపులను నిర్వహించాలని సూచించింది.

ఆధార్ తప్పనిసరి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను పొందేందుకు ఆధార్ తప్పనిసరి. ఆధార్ చేయించుకుని పదేళ్లు పూర్తయిన వారు తమ కార్డులను అప్‌డేట్ చేయించుకోవాలి. సాంకేతిక తప్పిదాలుంటే సరి చేసుకోవాలి. ఇలా చేయకపోతే అర్హులు సైతం సంక్షేమ ఫలాలకు దూరమయ్యే ప్రమాదముంది. ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసుకునేందుకు జిల్లాలో ప్రతి ఐదు సచివాలయాలకు ఒక ఆధార్ కేంద్రం చొప్పున మొత్తం 97 ఆధార్ కేంద్రాలను జిల్లాలో ఏర్పాటు చేశాం. డిసెంబర్ 14 వరకూ అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం ఉంది.

– జె.శంకర్, జిల్లా ఆధార్ కేంద్రాల కో ఆర్డినేటర్, కాకినాడ

28 నుంచి అండర్–14 క్రికెట్ టోర్నమెంట్



అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో చదును చేసే పనులు

అమలాపురం టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అమలాపురంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల పాటు అండర్–14 బాలుర రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందని ఆ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ ఏవీ శ్రీనివాస్, ఆ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట రవి తెలిపారు. అమలాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా స్థలం, బాలయోగి స్టేడియం, కిమ్స్ వైద్య కళాశాల క్రీడా స్థలాల్లో ఏక కాలంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తారన్నారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి ఒక్కో క్రికెట్ టీమ్ ఈ పోటీలకు హాజరవుతుందని గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి తెలిపారు. అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా స్థలాన్ని చదును చేసే పనులు గురువారం నుంచి మొదలయ్యాయి. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన టీమ్‌లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. దాదాపు 150 మంది అండర్–14 క్రికెట్ క్రీడాకారులు ప్రతిభ చాటనున్నారు. వీరికి వసతి, ఇతర సౌకర్యాలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పర్యవేక్షిస్తోంది.

దారి దోపిడీ దొంగల అరెస్ట్

ఏలూరు టౌన్: దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరిని ద్వారకాతిరుమల మండలం కప్పలగుంటలో బుధవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరు జంగాలకాలనీకి చెందిన మానిపాటి విజయ్‌కుమార్, రాజమహేంద్రవరంలోని చింతల నామవరం ప్రాంతానికి చెందిన దామిరెడ్డి త్రిమూర్తులుగా గుర్తించారు. వీరి నుంచి రూ.5 వేలు, ఒక బంగారు ఉంగరం, ఆటో సీజ్ చేశారు. మానిపాటి విజయ్‌కుమార్ రెండేళ్ల కిందట నుంచి తన స్నేహితులు సాల వెంకన్న, అతని భార్య ముంతాజ్, ధవళేశ్వరానికి చెందిన రవి, సానిటోరియానికి చెందిన మానస (హిజ్రా) గోకవరం బస్టాండ్ ప్రాంతానికి చెందిన కారు డ్రైవర్ సంజీవ్‌లు దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. కారును అద్దెకు తీసుకుని విజయవాడ వైపు వెళుతూ ఏలూరు జిల్లా దెందులూరు మండలం గుండుగొలను బస్టాండ్ సమీపంలో కారు రోడ్డు పక్కగా పార్కింగ్ చేసి ఉండటాన్ని గమనించారు. కారు డ్రైవర్ సీట్ వైపు అద్దం కిందకు దింపి ఉండడంతో డ్రింక్ తాగేందుకు ఆపినట్లు నిందితులు కారును ఆపి వేరొక కారులోని సీటులో ఉన్న పర్సులో బంగారు చైను, బంగారపు ఉంగరాన్ని, రూ.5 వేల నగదును కాజేశారు. జగ్గంపేట దగ్గరలోని ఎర్రవరం ప్రాంతంలో నాలుగేళ్ల కిందట విజయ్‌కుమార్, సాలా బలరాం ఇద్దరూ కలసి రాత్రి సమయంలో జాతీయ రహదారిపై టార్చ్‌లైట్ వేస్తూ వారివద్దకు వచ్చిన వ్యక్తిని కొట్టి రెండు బంగారు ఉంగరాలు లాక్కున్నారు. మూడేళ్ల కిందట సిద్ధాంతం ఇటుకల బట్టీ రోడ్డు పక్కన ఒక వ్యక్తి మద్యం మత్తులో తన మోటారు సైకిల్‌పై ఉండగా విజయ్‌కుమార్, సాల వెంకన్న, అతని భార్య ముంతాజ్, రవి, మానస (హిజ్రా), సంజీవ్ కలసి అతడ్ని కొట్టి 3 బంగారు ఉంగరాలు లాక్కున్నారు. రాజానగరం దాటిన అనంతరం మల్లేపల్లి సమీపంలో పామాయిల్ తోటల వద్ద చేప పిల్లల వ్యాన్ డ్రైవర్‌ను కొట్టి అతని మెడలోని బంగారు చైను లాక్కుని పారిపోయారు. దేవరపల్లి మండలం చిన్నాయగూడెం గ్రామానికి చెందిన ఆలూరి చిన్న వెంకటేశ్వరరావు అక్టోబర్ 25న మోటారు సైకిల్‌పై భీమడోలు వస్తున్నాడు. ద్వారకాతిరుమల మండలం కప్పలగుంట గ్రామంలో జాతీయ రహదారిలో ఒక కల్వర్టు వద్ద మోటారు సైకిల్‌ను ఆపగా అప్పటికే పొలంలో దాగి ఉన్న ఇద్దరు వ్యక్తులు వెంకటేశ్వరరావుపై ఆకస్మికంగా దాడి చేశారు. రూ.10 వేలు, సెల్‌ఫోన్, బంగారు ఉంగరాన్ని బలవంతంగా లాక్కున్నారు. ఈ ఘటనపై ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సీఐ యూజే విల్సన్ ఆధ్వర్యంలో ఎస్సై సుధీర్, సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. దారి దోపిడీకి పాల్పడిన విజయ్‌కుమార్, త్రిమూర్తులను సాంకేతిక పరిజ్ఞానంతో అరెస్ట్ చేశారు.

నర్సింగ్ స్కూల్‌లో దిద్దుబాటు చర్యలు

- విద్యార్థినులకు అల్పాహారం, భోజనం ఏర్పాటు
- మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారుల సూచన



లక్ష్మీ గాయత్రి నర్సింగ్ స్కూల్ విద్యార్థినులకు అధికారులు ఏర్పాటు చేసిన అల్పాహారం

కాకినాడ రూరల్: అన్ని రంగాల కంటే వైద్య రంగం ప్రధానమైంది. వైద్యులు, సిబ్బందిని భగవంతుడితో సమానంగా రోగులు భావిస్తుంటారు. ముఖ్యంగా నర్సుల సేవలు వెలకట్టలేనివి. అటువంటి నర్సింగ్ వృత్తిని ఎంచుకుని వస్తున్న వారికి ఇబ్బంది ఎదురైంది. తమ నుంచి నర్సింగ్ స్కూల్ యాజమాన్యం అధిక ఫీజులు వసూలు చేస్తూనే నాణ్యత లేని ఆహారంతో పాటు, టాయిలెట్లు, ఇతర కనీస వసతులు కల్పించక పోవడంతో తమ ఆక్రందనను జిల్లా కలెక్టర్‌కు వారు చేరవేశారు. తీవ్రంగా స్పందించిన కలెక్టర్ షణ్మోహన్ వెంటనే రంగంలోకి అధికారుల బృందాన్ని దింపి ఇంద్రపాలెంలోని లక్ష్మీ గాయత్రి నర్సింగ్ స్కూల్‌పై తనిఖీలు చేయించారు. ఆ స్కూల్‌లో డీఎంహెచ్‌ఓ, ఐసీడీఎస్ పీడీ, రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా బుధవారం రాత్రి పరిశీలించారు. అక్కడ విద్యార్థినులకు సరైన అల్పాహారం, భోజనం పెట్టడం లేదని తెలుసుకున్నారు. అర్హత కలిగిన బోధనా సిబ్బంది లేరని కనీసం విద్యార్థినులకు సరిపడా టాయిలెట్లు, బాత్ రూమ్‌లు లేవని గుర్తించారు. యాజమాన్యం నిర్లక్ష్యాన్ని అధికారులు వద్ద విద్యార్థినులు తేటతెల్లం చేయడంతో కలెక్టర్ ఆ సమస్యలపై తీవ్రంగా స్పందించారు. కేసు నమోదుకు ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఫీజుల కోసం వేధింపులు, సరైన మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో తీవ్ర అసంపూర్తితో ఉన్న ఐదుగురు విద్యార్థినులు లక్ష్మీ గాయత్రి నర్సింగ్ స్కూల్ యాజయాన్యంపై ఫిర్యాదు చేశారు. దీంతో ఆ స్కూల్ నిర్వాహకుడు సత్యనారాయణ మూర్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు తెలిపారు. ఆ నర్సింగ్ స్కూల్ విద్యార్థినులకు కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ మల్లిబాబు గురువారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు ఆహారం, సంరక్షణ, సరైన బోధన ఏర్పాటు చేయాలని, లేకుంటే గుర్తింపు రద్దుకు వెనకాడమని ఆర్డీఓ హెచ్చరించారు.

ఆటో, స్కూటర్ ఢీ: 8 మందికి గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని జి.వేమవరం జంక్షన్ జామకాయల తూము వద్ద గురువారం ఆటో, స్కూటర్ ఢీకొని ఎనిమిది మంది గాయాల పాలయ్యారు. స్థానికులు, కోరంగి పోలీసుల కథనం మేరకు.. తాళ్లరేవు నుంచి కాకినాడ వెళుతున్న ఆటో జి.వేమవరం వెళుతున్న స్కూటర్ ఎదురుగా వచ్చి ఢీకొన్నాయి. స్కూటర్‌ను తప్పించే క్రమంలో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, ఆరుగురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన వారు సారె తీసుకుని వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

ఇక భారీ వాహనాలకు బ్రేక్

రోడ్డు కం రైలు వంతెనపై గడ్డర్ల ఏర్పాటు



కొవ్వూరు టోల్‌గేట్ జంక్షన్ వద్ద గడ్డర్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై భారీ వాహనాలకు బ్రేక్‌లు వేశారు. వీటి రాకపోకలను నియంత్రించేందుకు శాశ్వతంగా భారీ గడ్డర్లు ఏర్పాటు చేశారు. గతంలో కొవ్వూరు– రాజమహేంద్రవరం ప్రవేశ ద్వారం వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు గడ్డర్లు ఏర్పాటు చేయించారు. ఇవి భారీ వాహనాల రాకపోకలతో పలుమార్లు దెబ్బతిన్నాయి. వాటిని తిరిగి ఏర్పాటు చేయించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికే పలుమార్లు గడ్డర్లు దెబ్బతిన్న నేపథ్యంలో వంతెన ప్రవేశ ద్వారంలో శాశ్వతంగా భారీ వాహనాలు రాకుండా రైల్వే శాఖ అధికారులు గురువారం రెండు వైపులా శాశ్వత గడ్డర్లను ఏర్పాటు చేయిస్తున్నారు. క్రేన్‌ల సాయంతో వీటిని పెట్టారు. ఇటీవల కాలంలో వంతెన పైనుంచి భారీ వాహనాలు వెళ్తుండడంతో భద్రత దృష్ట్యా అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు.

మెడికల్ షాప్, క్లినిక్ సీజ్



మెడికల్ షాపు, క్లినిక్‌ను సీజ్ చేస్తున్న వైద్య బృందం

కొత్తపల్లి: ఉప్పాడలోని సింధూ మెడికల్స్ జనరల్ స్టోర్స్, క్లినిక్‌ను గురువారం వైద్య బృందం తనిఖీ చేసి సీజ్ చేసింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సుబ్బంపేటకు చెందిన ఓ బాలికకు జ్వరంతో పాటు వాంతులు కావడంతో ఉప్పాడలోని ఆర్‌ఎంపీ వైద్యుడు మామిడి సూరిబాబు వద్దకు తీసుకు వెళ్లారు. అక్కడ బాలికకు ఇంజక్షన్, సిలెన్‌లు, ఆక్సిజన్ పెట్టారు. ఆక్సిజన్ ఎక్కకపోవడంతో మాత్రలు ఇచ్చి ఇంటికి తీసుకు వెళ్లమన్నారు. తర్వాత కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్తుండగా బాలిక మార్గ మధ్యంలోనే బుధవారం మృతి చెందింది. ఆర్‌ఎంపీ వైద్యం వికటించడంతో తమ కుమార్తె మృతి చెందిందని మైలపల్లి మల్లేశ్వరి ఆరోపించింది. గురువారం జిల్లా ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సుబ్బరాజు, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మురళీ, జిల్లా గణాంకాధికారి విజయలక్ష్మిలు మెడికల్ షాపును తనిఖీ చేశారు. బాలిక కుటుంబ సభ్యులు, ఆర్‌ఎంపీ వైద్యుడి వాంగ్మూలం రికార్డు చేశారు. ఆర్‌ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్, మెడికల్ షాపును సీజ్ చేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మ, గ్రామ రెవెన్యూ అధికారి సురేష్ ఉన్నారు.

పంటల్లో బయోయాక్టివ్ కాంపౌండ్స్ పెంచేలా ప్రయోగాలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పొగాకు, అశ్వగంధ, మిరప, పసుపు, ఆముదం పంటల్లో బయోయాక్టివ్ కాంపౌండ్స్, ఆల్కలాయిడ్స్ పెంచే దిశగా శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేపట్టాలని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్ఐ) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ సూచించారు. స్థానిక సీటీఆర్ఐ సమావేశ మందిరంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన పరిశోధనా సమావేశాలు గురువారంతో ముగిశాయి. పొగాకు పంటలో అధిక దిగుబడినిచ్చే మేలైన వంగడాలను అభివృద్ధి చేయడం, బయోటిక్ మరియు అబయోటిక్ ఒత్తిడిని తట్టుకునే వంగడాల అభివృద్ధి, తుపాను సమయంలో ఎదురయ్యే నీటి ముంపును తట్టుకునే వంగడాల పరిశోధనలపై విస్తృత చర్చ జరిగింది. పొగాకులో నికోటిన్ శాతం, పసుపులో కర్కుమిన్, అశ్వగంధ పంటలో విధనలాయిడ్స్, మిరప పంటలో క్యాప్సియాసీన్ పెంచే విధంగా వంగడాలను అభివృద్ధి చేయాలని సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్, పూర్వపు డైరెక్టర్ డాక్టర్ టీజీకే మూర్తి, ఐఐఓఆర్ పూర్వపు డైరెక్టర్ డాక్టర్ ఎం.సుజాత శాస్త్రవేత్తలకు సూచించారు. వంగడాల్లో మేలైన గుణాలైన ఆల్కలాయిడ్స్, ఫైటో కెమికల్స్, బయో ఆక్టివ్ కాంపౌండ్స్ మొదలైన వాటిని అభివృద్ధి చేసే దిశగా పరిశోధనలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ కె.గంగాధర, డాక్టర్ పి.మణివెల్, డాక్టర్ జేజే రాజప్ప, డాక్టర్ కె.ప్రభాకర రావు, డాక్టర్ పార్థ సాహా, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తమ పరిశోధన ఫలితాలను వెల్లడించారు. ఈ సాంకేతిక సమావేశాల్లో సంస్థ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్ కూడా తమ ప్రయోగాల ఫలితాలను నిపుణులకు వెల్లడించారు. మెంబర్ సెక్రటరీ డాక్టర్ ఎం.అనురాధ, సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పథకం వేశారు.. దొంగిలించారు

చివరికి పోలీసులకు చిక్కిన ముగ్గురు



వివరాలను వెల్లడిస్తున్న నిడదవోలు సీఐ తిలక్

నిడదవోలు: జల్సాలకు అలవాటు పడిన వారు చోరీలు చేయాలని పథకం వేశారు.. ఓ వృద్ధురాలి మెడలో బంగారు ఆభరణాలు అపహరించి, చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. ఆ వివరాలను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ పీవీజీ తిలక్ విలేకర్లకు వెల్లడించారు. నిందితులు భీమవరం మండలం యనమదుర్రుకు చెందిన చెల్లుబోయిన సత్యనారాయణ, పెరవలి మండలం కానూరు అగ్రహారానికి చెందిన పాక వీరస్వామిలు 2007లో దుబాయ్‌లో తాపీపని చేసేవారు. అక్కడ సంపాదించిన డబ్బులు చెడు వ్యసనాలకు ఖర్చుపెట్టారు. దీంతో వీరిద్దరూ అప్పుల పాలయ్యారు. ఏదొక దొంగతనం చేసి అప్పులు తీర్చాలని పథకం వేశారు. పాక వీరస్వామి పట్టణంలోని గాంధీనగర్‌లో వీధి వీధిన తిరిగి ఉల్లిపాయల వ్యాపారం చేశాడు. ఈ సమయంలో ఓ ఇంట్లో వృద్ధ దంపతులు నూలి రామారావు, అన్నపూర్ణలు ఉంటున్నారని గ్రహించాడు. ఉల్లిపాయలు అమ్మే క్రమంలో అన్నపూర్ణ మెడలో బంగారం ఎక్కువగా ఉందని గుర్తించాడు. ఈ విషయాన్ని చెల్లుబోయిన సత్యనారాయణకు చెప్పాడు. బంగారం దొంగలించాలని ఇద్దరూ పథకం వేశారు. ఈ విషయాన్ని చెల్లుబోయిన సత్యనారాయణకు తమ్ముడు వరసైన ఉండి మండలం మహదేవీపట్నం గ్రామానికి చెందిన సంమింగి సన్యాసిరావుకు చెప్పారు. దీంతో ఈ నెల 8న ఎవరూ సంచరించని సమయంలో పాక వీరస్వామి తన ఉల్లిపాయల ఆటోను తీసుకువచ్చి వృద్ధురాలు అన్నపూర్ణ ఇంటి ముందు పెట్టాడు. ఆటోలో స్పీకర్ ద్వారా ఉల్లిపాయలు విక్రయిస్తున్నట్లు గట్టిగా సౌండ్ పెట్టాడు. ఇంతలో సంమింగి సన్యాసిరావు, చెల్లుబోయిన సత్యనారాయణలు మోటార్ సైకిల్‌పై వృద్ధురాలి ఇంటికి వచ్చారు. సత్యనారాయణ గేటు తీసుకుని ఇంట్లోకి ప్రవేశించి, ఇల్లు అద్దెకు కావాలని అడిగాడు. బిల్డింగ్‌లో ఖాళీగా ఉన్న రెండో పోర్షన్ చూపించే క్రమంలో ఇద్దరూ లోపలకు వెళ్లారు. సత్యనారాయణ వృద్ధురాలు అన్నపూర్ణ మెడలో ఉన్న రెండు పేటల బంగారు గొలుసు లాక్కుని బయటకు వచ్చాడు. అప్పటికే సన్యాసిరావు బైక్ స్టార్ట్ చేసి రెడీగా ఉండటంతో ఇద్దరూ కలసి వెళ్లిపోయారు. దీనిపై కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు గురువారం కంసాలపాలెం గ్రామ శివారున చెల్లబోయిన సత్యనారాయణ, పాక వీరస్వామి, సంమింగి సన్యాసిరావులను అరెస్టు చేశారు. వీరి నుంచి 43 గ్రాముల రెండు పేటల బంగానే గొలుసును స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్వదేశానికి బాధిత మహిళ



కుమారి రాక కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు

గండేపల్లి: బతుకు తెరువు కోసం కువైట్‌కు వెళ్లి అక్కడ చిత్రహింసలకు గురైన మహిళ శుక్రవారం స్వదేశానికి రానుంది. 'నన్ను చంపేసేలా ఉన్నారు.. కాపాడండి!' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో బుధవారం వచ్చిన కథనానికి అధికారులు, ప్రభుత్వం స్పందించి తక్షణ సహాయక చర్యలు చేపట్టింది. గండేపల్లి మండలం యల్లమిల్లిలో బాధితురాలి కుటుంబ సభ్యులను కలసిన అధికారులు వివరాలు తెలుసుకుని కువైట్‌కు పంపిన పాలకొల్లుకు చెందిన ఏజెంట్ ఎం.సుధాకర్‌తో మాట్లాడారు. ఏజెంట్ కూడా కువైట్‌లో ఉండటంతో బాధితురాలు గారా కుమారిని గురువారం కువైట్ నుంచి విమానం ఎక్కిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం ఉదయానికి ఆమె హైదరాబాద్ చేరుకోనున్నట్టు తెలిసింది. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు కనిపే సీత, అప్పారావు, పిల్లలు నాగమణి, సుబ్బలక్ష్మి, ఆనంద్ శామ్యూల్ సంతోషం వ్యక్తం చేశారు.

సీబీఐ నుంచి మాట్లాడుతున్నామంటూ బెదిరింపు

పి.గన్నవరం: రోజు రోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. తాజాగా పి.గన్నవరానికి చెందిన బొరుసు చంద్రశేఖర్‌కు గురువారం గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ కుమార్తె దంత వైద్య విద్యార్థిని. ఆమె ప్రస్తుతం పీజీ చేస్తోంది. గురువారం ఉదయం 6.30 గంటలకు చంద్రశేఖర్ తన కుమార్తెతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేసి శేఖర్‌తో ఇంగ్లిష్‌లో మాట్లాడాడు. తాను సీబీఐ నుంచి మాట్లాడుతున్నానని, మీ కుమార్తెను ఒక నేరంపై అరెస్టు చేశామని, ఆమె తమ అదుపులో ఉందని బెదిరించాడు. ఇది ఫేక్ కాల్ అని గ్రహించి అవతలి వ్యక్తిని గట్టిగా నిలదీయడంతో వెంటనే కాల్ కట్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ నంబర్‌కు పోలీస్ గెటప్‌లో ఉన్న ఒక వ్యక్తి ఫొటో ఉంది.